# అర్ధాకలితో కాలేజీ చదువులు

- కళాశాలల్లో అమలు కాని మధ్యాహ్న భోజనం పథకం
- గత ప్రభుత్వం ప్రకటించి, మంత్రివర్గ ఆమోదం
- ప్రభుత్వం మారడంతో అమలు నిలిపివేత



ఇంటి భోజనం తింటున్న విద్యార్థులు

గూడూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు కాకపోవడంతో, అందులో చేరిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పట్టణ, మండల ప్రాంత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడుగుపెట్టగానే భోజనం విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా అమలు చేస్తామంటూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రకటించి మంత్రివర్గ ఆమోదం తెలిపింది. పేదరికంతో అల్లాడుతూ తమ పిల్లలు తమలాగా కష్టపడకూడదని నమ్మిన తల్లిదండ్రులు మధ్యాహ్న భోజన పథకంపై ఆనందం వ్యక్తం చేశారు. కానీ అప్పటి ప్రభుత్వ హామీ కేవలం ప్రకటనలకే పరిమితమైంది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పథకం అమలు నిలిచిపోయింది. దీంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రుల ఆనందం ఆవిరైపోయింది. ఈనెల 2నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**పథకం అమలైతే...**

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు ఉండగా బయ్యారం, కొత్తగూడ, గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం, గార్ల, తొర్రూరు మండలాల్లో కలిపి మొత్తం 9జూనియర్ ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం వివిధ గ్రూపులకు చెందిన సుమారు 2000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ విద్యా సంవత్సరం కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు స్వల్పంగా తగ్గాయి. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలైతే విద్యార్థుల సంఖ్య పెరిగి, కళాశాలలు బలోపేతమయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే బాగుంటుంది. కళాశాలకు వెళ్లే ఒక్కోసారి పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆకలితో చదువుపై దృష్టి సారించలేకపోతున్నాం. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి విద్యాభివృద్ధికి సహకరించాలి.

– షర్మిల, విద్యార్థిని

# ఫీజు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న పృథ్వీ

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18నెలలు గడుస్తున్నా విద్యార్థులకు రావల్సిన పెండింగ్ ఫీజు బకాయిల విషయంలో స్పందించకుండా విద్యార్థులకు మొండి చేయి చూపిస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు రావలిసిన రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళన లో చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నందీశ్వర్, కార్యదర్శి గౌతం, సుహిత, శ్రావణ్ కుమార్, ప్రవీణ్, మహేష్ పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి



మాట్లాడుతున్న ఉపేందర్

బయ్యారం: ఐసీడీఎస్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం పర్మనెంట్ చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొనాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్పొరేట్, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం పనిచేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ వల్లాల వెంకన్న, ఉపేంద్ర, సరిత, మల్లికాంబ, సుధారాణి, సరస్వతి పాల్గొన్నారు.

# నేర ప్రవృత్తి మార్చుకోకపోతే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ సీఐ మహేందర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: నేర ప్రవృత్తి కలిగిన వారు తమ పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు ఉంటాయని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. నేరాలకు పాల్పడుతూ సస్పెక్ట్ షీట్స్ కలిగిన పలువురు నిందితులకు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్ రెడ్డి సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా తమ ప్రవర్తన మార్చుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్సైలు శివ, విజయ్ కుమార్, అలీం హుస్సేన్, సూరయ్య పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న పాలకులు





మాట్లాడుతున్న జడ సత్యనారాయణ

గార్ల: కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం గార్లలో జరిగిన ఏఐకేఎంఎస్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, అధికారం చేపట్టిన కేంద్ర రాష్ట్ర పాలకులు ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉన్న 339 ఆదివాసీ గ్రామాలను 49 జీఓ ప్రకారం ఖాళీ చేయడం కోసం ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, సహాయ కార్యదర్శి సక్రు, మనోహర్, గౌని మల్లేష్, వెంకన్న, మాన్యా, శ్రీరాములు పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్య

గార్ల: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కోట్యానాయక్‌తండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం కోట్యానాయక్‌తండాకు చెందిన భూక్యా నీల (47) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీనికి తోడు మద్యంకు అలవాటు అయ్యింది. అనారోగ్య సమస్య ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 28న పురుగుమందు తాగింది. ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందింది. మృతురాలి భర్త మంగీలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా తెలిపారు.

### పశువుల పట్టివేత

మహబూబాబాద్ రూరల్: సంతలో కొనుగోలు చేసి కమేలాకు తరలిస్తున్న ఏడు పశువులను హిందూ సంఘాల బాధ్యులు సోమవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దార ఇందుభారతి మాట్లాడుతూ.. స్థానిక ఈద్గా బజారు సమీపంలో రెండు వాహనాల్లో ఉన్న పశువుల సమాచారాన్ని డయల్ 100కు తెలియజేసి పోలీసులకు అప్పగించామని పేర్కొన్నారు. ఈ విషయంపై టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డిని వివరణ కోరగా ఏడు పశువుల పట్టివేతపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### విద్యుత్ కనెక్షన్ తీసుకోనివ్వడం లేదు

మరిపెడ రూరల్: వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్ తీసుకోనివ్వడం లేదని, దీంతో వరి నారు మడి ఎండిపోతుందని రైతు దంపతులు చింతపల్లి మల్లయ్య, పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. తమ పొలం గెట్టుకు ఆనుకుని ఇదే గ్రామానికి చెందిన మాడుగుల ఉపేందర్ అనే వ్యక్తికి ఐదున్నర ఎకరాల మామిడి తోట ఉందన్నారు. తమకు విద్యుత్ సరఫరా కావాలంటే మామిడి తోట గెట్టు పక్కనుంచి పెట్టుకోనియడం లేదని వారు కన్నీటి పర్యంతమయ్యారు. 11విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ.65 వేల డీడీ కూడా కట్టినట్లు వారు తెలిపారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా అయ్యేలా చర్య తీసుకోవాలని వేడుకున్నారు. ఈ విషయంపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు దంపతులు తెలిపారు.

### మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు లింగంపల్లి భిక్షపతి (90) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. భిక్షపతి మృతదేహాన్ని ఆయన కుమారుడు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి దయానంద్ మెడికల్ కళాశాలకు దానం చేశాడు.

### ప్రయాణికుడి నగదు చోరీ

తొర్రూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి నగదు చోరీ చేసిన ఘటన సోమవారం డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల మేరకు...మండలంలోని పోలెపల్లి గ్రామానికి చెందిన తండా రాజలింగం గేదెను కొనడానికి ఇల్లెందుకు వెళ్లేందుకు తొర్రూరు బస్టాండుకు వచ్చాడు. మహబూబాబాద్ డిపో బస్సు రాగా ఎక్కి కొద్ది దూరం ప్రయాణించాడు. అనుమానం వచ్చి అతని ప్యాంటు జేబు చూసుకోగా నగదు చోరీకి గురైంది. ఇంటి దగ్గర నుంచి రూ.1.25లక్షలు తెచ్చుకోగా దానిలో రూ.లక్ష చోరీ జరిగినట్లు బాధితుడు గుర్తించాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**బైండోవర్, జరిమానా**

డోర్నకల్: తరచూ గుడంబా తయారు చేస్తున్న వ్యక్తికి డోర్నకల్ తహసీల్దారు రూ.30వేల జరిమానా విధించారు. టేకులతండాకు చెందిన మాలోత్ బాబు గతంలో గతంలో సారాయి తయారీ రవాణా కేసులో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ జి.చిరంజీవి తెలిపారు.

**హద్దులు ఏర్పాటు చేయాలి**

గార్ల: కబ్జాకు గురైన గార్ల పెద్దచెరువు శిఖం భూమిని స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారికి సోమవారం మండల అఖిలపక్షం నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు కందునూరి శ్రీనివాసరావు, లక్ష్మణ్‌నాయక్, సత్యవతి, సక్రు ఉన్నారు.

**ఎంపీడీఓకు వినతిపత్రం**

నర్సింహులపేట: సమగ్ర కుటుంబ, కుల సర్వే చేసిన ఉపాధ్యాయులకు రావాల్సిన గౌరవ భృతి రాలేదని డిమాండ్ చేస్తు సోమవారం ఎంపీడీఓ యాకయ్యకు కులగణన సర్వేలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు వినతి పత్రం అందచేశారు.

**బాధిత కుటుంబానికి ఆర్థికసాయం**

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన సట్ల అంజలి ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మృతురాలి చిన్నకుమార్తె మనస్వినికి రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మామిడి అశోక్, లక్కాకుల సత్యనారాయణ, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

**రోడ్డు విస్తరణ పనులను అడ్డుకున్న గ్రామస్తులు**

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి అంబేడ్కర్ సెంటర్ నుంచి చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను పలువురు గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. సోమవారం సంబంధిత అధికారులు యంత్రాల సాయంతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండగా, స్థానికులు పనులను ఆపివేయాలంటూ వాగ్వాదానికి దిగారు.

**పట్టణ ఉపాధ్యక్షుడిగా సువర్ణరాజు**



డోర్నకల్: మాలమహానాడు డోర్నకల్ పట్టణ ఉపాధ్యక్షుడిగా నెహ్రూస్ట్రీట్‌కు చెందిన చిలకబత్తిని సువర్ణరాజ్ నియమితులయ్యారు. సువర్ణరాజ్‌ను పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు మాలమహానాడు మండల ఉపాధ్యక్షుడు పగిడిపల్లి వీర్రాజు ప్రకటించారు.

**కాల్వల మరమ్మతుపై నిర్లక్ష్యం**

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు ఆయకట్టు కాల్వలకు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, సీపీఎం మండల కార్యదర్శి నంబూరి మధు ఆరోపించారు. మండలంలోని కోటగడ్డ సమీపంలోని కాల్వలను సోమవారం వారు రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు భూషణ్‌రావు, నాగేశ్వరరావు, మధుసూదనరావు, రాంబాబు, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

**నీళ్లు ఇవ్వమంటే అరెస్టులు చేస్తారా?**

బయ్యారం: సీతారామ నీటిని భద్రాద్రి జిల్లాతోపాటు ఇల్లెందు నియోజకవర్గానికి ఇవ్వమని శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులను అరెస్ట్ చేయటం తగదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి**

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ రాందాస్ నిర్వాహకులకు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యార్థులకు యూనిఫాంలు సోమవారం హెచ్‌ఎంలకు అందించారు.

## ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమని, మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాలు వేరుచేయడం వంటి పద్ధతులు అలవర్చుకోవాలని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో సోమవారం నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ (ఎన్ఎస్‌పీసీ) పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి రక్షణ కోసం కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో హరిత్.. ద వే ఆఫ్ లైఫ్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా పోటీ నిర్వహిస్తున్నారన్నారు. జూలై 1నుంచి ఆగస్టు 21వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈకో మిత్ర అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, జిల్లా జాతీయ హరితదళం కోఆర్డినేటర్ డాక్టర్ వి.గురునాథరావు, జీసీడీఓ విజయకుమారి, ఏఎస్ఈ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు పింఛన్ ఇవ్వాలి



గార్ల: దీక్షలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు

గార్ల: తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలంతోపాటు, పింఛన్ ఇవ్వాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఉద్యమకారులు స్థానిక అమరవీరుల స్తూపం వద్ద శాంతియుత దీక్ష చేపట్టారు. దీక్ష శిబిరాన్ని సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సందర్శించి తమ సంఘీభావం ప్రకటించారు. దీక్షలో జడ సత్యనారాయణ, కొమ్మరాజు జగదీష్, జానిమియా, మల్లిబాబు, గౌని మల్లేశం, గౌని భద్రయ్య, జహంగీర్, యాకూబ్‌పాషా, శ్రీను, సర్వర్ పాల్గొన్నారు.

కేసముద్రం: తెలంగాణ మలిదశ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు చాగంటి కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మోడెం రవిందర్‌గౌడ్, దండు శ్రీనివాస్, బాలమోహన్, సోమారపు వెంకటయ్య, చిట్యాల వీరన్న పాల్గొన్నారు.

**ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి**

తొర్రూరు: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని టీయూఎఫ్ మండల అధ్యక్షుడు తాళ్ల మల్లయ్య కోరారు. సోమవారం డివిజన్ కేంద్రంలో దీక్షను చేపట్టారు. కార్యక్రమంలో అనపురం వెంకన్నగౌడ్, వాసిరెడ్డి నరసింహారెడ్డి, పంతం సురేందర్, బానోతు రెడ్యా నాయక్, వేల్పుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతాం..



పెద్దవంగర: మాట్లాడుతున్న ఈదురు ఐలయ్య

పెద్దవంగర: బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుల మీద కేసులు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపడం ఆగదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల యూత్ అధ్యక్షుడు కాసాని హరీష్ అధ్యక్షతన సోషల్ మీడియా, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య పాల్గొని మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గం యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ఏర్పాటు చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే హామీ ఏమైందో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు వేణు సాగర్, అనిల్, అనుదీప్, దయాకర్, సతీష్, మహేష్, రాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం**

తొర్రూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీరాం సుధీర్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చెర్లపాలెం, హరిపిరాల గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుధీర్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు నలమాస ప్రమోద్, ఎన్నమనేని శ్రీనివాసరావు, బిందు శ్రీనివాస్, మాలోతు కాలునాయక్, రాయిశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

## పల్లెప్రకృతి వనం స్థలం ఆక్రమణకు యత్నం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం (బ్రాహ్మణపల్లి) జీపీ పరిధిలోని జిల్లెల్లగూడెం పల్లె ప్రకృతివనం స్థలం ఆక్రమణకు కొందరు వ్యక్తులు యత్నిస్తున్నారని గ్రామస్తులు సోమవారం తెలిపారు. లక్ష్మీపురం (బ్రాహ్మణపల్లి) జీపీ పరిధిలో గల 299/14 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉండగా అప్పటి కలెక్టర్ వీపీ.గౌతమ్ సుమారు ఐదు ఎకరాల మేరకు ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించారని పేర్కొన్నారు. దాని చుట్టూ హద్దురాళ్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా జీఓ తీసుకువచ్చి దానిని మెగా పల్లె ప్రకృతి వనంగా నామకరణం చేసి జీపీకి వినియోగిస్తున్నారని తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ స్థలంలో ట్రాక్టరుతో అక్రమంగా దున్ని అక్కడ ఉన్న హద్దురాళ్లను తొలగించారని, ఆ వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుని శిక్షించాలని గ్రామస్తులు కోరారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి దోషులైన వారిపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి తెలిపారు.

### పీరీల సంబురాలు



కురవి: పీరీల గుండం దాటుతున్న భక్తుడు

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా గ్రామంలో సోమవారం వైభవోపేతంగా పీరీల పండుగ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిదిరోజులపాటు ఈ వేడుకలను నిర్వహిస్తారు. కార్యక్రమంలో శ్రీకాంత్, భీముడు, శ్రీను, లాలు, అశోక్, ఉదయ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: డోర్నకల్, గొల్లచర్ల, ముల్కలపల్లి, ఉయ్యాలవాడ గ్రామాల్లో పీరీలను ముస్తాబు చేసి వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నారు.

### వీఆర్‌ఏల అరెస్ట్ సరికాదు

పెద్దవంగర: వీఆర్‌ఏలను అక్రమ అరెస్టులు చేయడం సరికాదని వీఆర్‌ఏ వారసుల సంఘం మండల అధ్యక్షుడు నీరటి యాకయ్య అన్నారు. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీఓలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా వెళ్తున్న మండల వీఆర్‌ఏలను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

### వరి నారుమడుల పరిశీలన

నర్సింహులపేట: మండలంలోని జయపురం , బక్కతండా, బాసుతండాల్లో సోమవారం వరి నారుమళ్లను ఏఓ వినయ్‌కుమార్ పరిశీలించారు. వరి నారుమడి తొలిదశలో ఉందని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



## క్లుప్తంగా

### పాఠశాల అభివృద్ధికి చెక్కు అందజేత



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం ఉన్నత హెచ్‌ఎం సంకా బద్రినారాయణ తన ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి రూ.50వేల చెక్కును సోమవారం అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వలబోజు స్నేహలత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తోడుసు వీరలక్ష్మికి చెక్కును అందజేశారు. అనంతరం బద్రినారాయణను పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగయ్య, రమాదేవి, పరమాత్మచారి, బాబురెడ్డి, సుజాత, సౌభాగ్య, హైమావతి, మమత పాల్గొన్నారు.

### ఉత్తమ విద్యాబోధనతో గుర్తింపు

డోర్నకల్: ఉత్తమ విద్యను బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎల్లప్పుడు గుర్తుంటారని ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్ తెలిపారు. స్థానిక పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో సోషల్ టీచర్‌గా విధులు నిర్వహించి సోమవారం పదవీ విరమణ పొందిన బత్తుల కృపాకాంత సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండి నర్సింహారావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మాంగదరరావు, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్, వెంపటి సీతారాములు, ప్రభుదాస్, తలారి విద్యాసాగర్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### రోటరీక్లబ్ మానుకోట శాఖకు అవార్డులు

మహబూబాబాద్: రోటరీ క్లబ్ మానుకోట శాఖకు 2024–25 సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలకు గాను ఏడు అవార్డులు వచ్చినట్లు క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు గూడూరు నాగేశ్వర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి రోటరీ డిస్ట్రిక్ట్ 3150 అవార్డ్స్ సైట్ కార్యక్రమం నిర్వహించారు. అవార్డులను డిస్ట్రిక్స్ గవర్నర్‌శ రత్ చౌదరి, డిప్యూటీ గవర్నర్ సాంబశివరావు, అసిస్టెంట్ గవర్నర్ భూషణ్ చేతుల మీదుగా అందజేశారు.

### క్రీడలకు ఎంపిక

గూడూరు: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం జరుగుతున్న క్రీడల్లో మండలంలోని ఏపూరుకు చెందిన భానోతు భగత్‌సింగ్ రామ్ అనే విద్యార్థి మండల, జిల్లాస్థాయిలో రాణించి, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు జిల్లా స్పోర్ట్స్ అధికారి ఒలేటి జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

చిన్నగూడూరు: ప్రభుత్వ సంస్థలలో పని చేస్తున్న ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఆర్డీఓ గణేష్, జెడ్పీసీఈఓ పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్ పేర్కొన్నారు. తహసీల్దార్‌గా, ఎంపీడీఓగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న తహసీల్దార్ మహబూబ్అలీ, ఎంపీడీఓ రామారావులకు కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.

### బడ్జెట్‌లో నిధులు పెంచి ఇవ్వాలి

నెహ్రూసెంటర్: దేశంలో విద్య, వైద్యం, ఉపాధి కోసం బడ్జెట్‌లో అధిక నిధులు పెంచి ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కె మధార్ అన్నారు. ఈనెల 9వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, భిక్షపతి, సట్ల యాకయ్య, వీరన్న, హుస్సేన్, పాపయ్య పాల్గొన్నారు.

### రేపు జాబ్‌మేళా

మహబూబాబాద్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 2వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత సోమవారం ప్రకటనలో తెలిపారు. శ్రీరైతు మిత్ర ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మానుకోట కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయస్సు 20నుంచి 32 సంవత్సరాల మధ్యలో ఉండాలన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న వారు ఉద్యోగాలకు అర్హులన్నారు. కంపెనీలో సేల్స్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పోస్టులు ఉన్నాయన్నారు. ఈనెల 2న కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బయ్యారం: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రథమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ సోమవారం తెలిపారు. 18నుంచి 35 సంవత్సరాల వరకు ఉన్న యువతీ, యువకులకు అవకాశం ఉందన్నారు.